# ప్రజా ముచ్చట

తెలుగు దినపత్రిక

మా ప్రతీ అక్షరం – ప్రజల ముచ్చటే



ప్రజా ముచ్చట తెలుగు దిన పత్రిక

విలేకర్లు కావలెను

తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాల వ్యాప్తంగా జిల్లా స్టాఫర్లు, నియోజకవర్గ ఆర్.సి. ఇంఛార్జ్‌లు, మండలాల వారిగా విలేకర్లు కావలెను.

అనుభవం, ఆసక్తిగలవారు 99086 89674 లో సంప్రదించగలరు



హైదరాబాద్ | శనివారం,మే31,2025 | ఎడిటర్: పండ్ల నాగరాజు | పేజీలు: 4 వేల: 1


పాక్ దాడుల బాధితులకు త్వరలోనే

## ప్యాకేజీ ఇస్తాం

- బీఎస్ఎఫ్ దెబ్బకు పాక్ విలవిల్లాడిందన్న అమిత్ షా
- పాక్ నిఘా వ్యవస్థ ఛిన్నాభిన్నమయిందని వ్యాఖ్య
- పాకిస్థాన్ కోలుకోవడానికి కనీసం నాలుగైదేళ్లు పడుతుంది: అమిత్ షా



ఆపరేషన్ సిందూర్ తర్వాత కేంద్ర హెూంమంత్రి అమిత్ షా తొలిసారిగా ఈరోజు జమ్మూకశ్మీర్ లో పర్యటించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... భారత బలగాల ధైర్యసాహసాలను కొనియాడారు."ఉగ్రవాద స్థావరాలను లక్ష్యంగా చేసుకుని మనం చేపట్టిన ఆపరేషన్ సిందూర్‌కు ప్రతిగా, పాకిస్థాన్ సైన్యం మన సరిహద్దుల్లోని పౌరులపై దాడులకు తెగబడింది. అయితే, మన బీఎస్ఎఫ్ దళాలు ఈ దాడులను అత్యంత సమర్థవంతంగా తిప్పికొట్టాయి" అని తెలిపారు. ఈ క్రమంలో పాకిస్థాన్‌కు చెందిన సుమారు 118 పోస్టులను మన బలగాలు నాశనం చేశాయని ఆయన వెల్లడించారు. "శత్రువుల సమాచార, నిఘా వ్యవస్థలను మనవాళ్లు ఒక్కొక్కటిగా కూల్చివేశారు. ఈ నష్టం నుంచి కోలుకోవడానికి పాకిస్థాన్‌కు కనీసం నాలుగైదేళ్లు పడుతుంది" అని అమిత్ షా పేర్కొన్నారు.

ఢిల్లీలో ఏపీ సీఎం చంద్రబాబును

## కలిసిన మంద కృష్ణ



పద్మశ్రీ పురస్కార గ్రహీత, ఎమ్మార్పీఎస్ (మాదిగ రిజర్వేషన్ పోరాట సమితి) వ్యవస్థాపక అధ్యక్షుడు మందకృష్ణ మాదిగ నేడు ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబుతో సమావేశమయ్యారు. వీరి భేటీ దేశ రాజధాని ఢిల్లీలో జరిగింది.ఇటీవల భారత రాష్ట్రపతి చేతుల మీదుగా ప్రతిష్ఠాత్మక పద్మశ్రీ పురస్కారాన్ని అందుకున్న మందకృష్ణ మాదిగను ఈ సందర్భంగా ముఖ్యమంత్రి చంద్రబాబు ప్రత్యేకంగా అభినందించారు. సామాజిక న్యాయం కోసం మందకృష్ణ మాదిగ చేస్తున్న కృషిని ప్రస్తావించారు.

## నష్టాలతో ముగిసిన మార్కెట్లు

-ఆటో, మెటల్, ఐటీ షేర్లలో అమ్మకాల ఒత్తిడి
-182 పాయింట్లు కోల్పోయిన సెన్సెక్స్
- 82 పాయింట్లు నష్టపోయిన నిఫ్టీ



న్యూఢిల్లీ,మే30) దేశీయ స్టాక్ మార్కెట్ సూచీలు ఈరోజు నష్టాలతో ముగిశాయి. అంతర్జాతీయ మార్కెట్ల నుంచి అందిన బలహీన సంకేతాలతో ఉదయం నష్టాలతో ప్రారంభమైనప్పటికీ, కొన్ని ప్రధాన షేర్లలో కొనుగోళ్ల మద్దతుతో కాసేపు లాభాల బాట పట్టాయి.



బ్రహ్మోస్' దెబ్బకు పాకిస్థాన్‌కు కంటిమీద

# కునుకు లేదు...

బ్రహ్మోస్ క్షిపణి దెబ్బకు పాక్ విలవిల్లాడింది..

- ఆపరేషన్ సిందూర్ తో పాక్ సైన్యం యుద్ధం ఆపమని వేడుకుందని ఎద్దేవా
- పాకిస్థాన్‌లోకి వందల మైళ్లు చొచ్చుకెళ్లి ఉగ్రవాద స్థావరాలను ధ్వంసం చేశామని వెల్లడి
- భారత క్షిపణులు తమ లక్ష్యాలను ఛేదించాయని పాక్ ప్రధాని షెహబాజ్ షరీఫ్ అంగీకారం
- కాన్పూర్ ప్రసంగంలో, ఆపరేషన్ సిందూర్ భారతదేశ 'సైనిక శక్తి'ని ప్రపంచానికి చాటిచెప్పింది
- ప్రధానమంత్రి నరేంద్ర మోదీ

న్యూఢిల్లీ,మే30,

భారత బ్రహ్మోస్ క్షిపణి పాకిస్థాన్‌కు కంటిమీద కునుకు లేకుండా చేసిందని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ అన్నారు. జమ్మూకశ్మీర్‌లోని పహల్గామ్‌లో ఏప్రిల్‌లో జరిగిన ఉగ్రదాడికి ప్రతిస్పందనగా చేపట్టిన 'ఆపరేషన్ సిందూర్' తర్వాత మూడు వారాలకు, నేడు కాన్పూర్‌లో ప్రధాని ఈ వ్యాఖ్యలతో పాకిస్థాన్‌పై మరోసారి తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు.ఉత్తర ప్రదేశ్‌లోని కాన్పూర్‌లో దాదాపు రూ. 50,000 కోట్ల విలువైన మౌలిక సదుపాయాల ప్రాజెక్టులను ప్రారంభించిన అనంతరం ప్రధాని మోదీ ప్రసంగించారు. రాష్ట్ర అభివృద్ధి కార్యక్రమాల నుంచి భారత సైనిక దళాల పరాక్రమం వైపు ప్రసంగాన్ని మళ్లించిన ఆయన, "మనం పాకిస్థాన్‌లోకి వందల మైళ్లు చొచ్చుకెళ్లి ఉగ్రవాద స్థావరాలను ధ్వంసం చేశాం" అని ప్రకటించారు. "మన సాయుధ బలగాల వీరోచిత చర్యలతో పాకిస్థాన్ సైన్యం యుద్ధాన్ని ఆపమని వేడుకోవాల్సి వచ్చింది" అని వెల్లడించారు.

తెలంగాణ ప్రగతి

## ప్రపంచానికే ఆదర్శం

- లండన్‌లో జరుగుతున్న బ్రిడ్జ్ ఇండియా వీక్ 2025 సదస్సులో కేటీఆర్ కీలక ప్రసంగం
- సంపద సృష్టించి, అట్టడుగు వర్గాలకు పంచడమే తమ విధానమని వెల్లడి
- కాళేశ్వరం, మిషన్ భగీరథ ప్రాజెక్టుల విజయాలను ప్రస్తావించిన కేటీఆర్
- కేసీఆర్ నాయకత్వంలో సంక్షేమం, అభివృద్ధిని సమన్వయం చేశామన్న కేటీఆర్



రాష్ట్ర అభివృద్ధికి కిషన్ రెడ్డి

## అడ్డుపడుతున్నారు

- కేటీఆర్, కవిత, హరీశ్ మధ్య ఆస్తి గొడవలు
- ఆస్తుల కోసం కేసీఆర్ కుటుంబంలో ఫైట్ జరుగుతోందన్న కోమటిరెడ్డి
- కేటీఆర్, కవిత, హరీశ్ రావు మధ్య విభేదాలున్నాయని వెల్లడి
- మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి



ఉమ్మడి నల్గొండ జిల్లాలో ఐదేళ్లలో సాగునీటి

## ప్రాజెక్టులు పూర్తి చేస్తాం

- ప్రభుత్వ ఉద్యోగుల అలసత్వంపై ఉత్తమ్ కుమార్ రెడ్డి ఫైర్
- సూర్యాపేటలో మంత్రులు ఉత్తమ్, తుమ్మల పర్యటన
- ప్రభుత్వమే చివరి గింజ వరకు వరి ధాన్యం కొనుగోలు చేస్తుందని స్పష్టీకరణ

మే30,() ప్రభుత్వ ఉద్యోగులు పనితీరులో అలసత్వం ప్రదర్శిస్తే కఠిన చర్యలు తప్పవని, పాలనలో నిర్లక్ష్యాన్ని సహించేది లేదని రాష్ట్ర మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి హెచ్చరించారు. సూర్యాపేటలో మంత్రి తుమ్మల నాగేశ్వరరావుతో కలిసి ఆయన పలు అభివృద్ధి కార్యక్రమాల్లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఉత్తమ్ కుమార్ రెడ్డి మాట్లాడుతూ, తమ ప్రభుత్వం అధిక మొత్తంలో వరి ధాన్యం కొనుగోలు చేస్తోందని, చివరి గింజ వరకూ కొంటామని రైతులకు భరోసా ఇచ్చారు.



సైన్యాన్ని కించపరచడం కాంగ్రెస్‌కు

## పరిపాటిగా మారింది

- పాక్‌తో యుద్ధ విరమణపై ప్రధాని మోదీని విమర్శించిన సీఎం రేవంత్ రెడ్డి
- రేవంత్ రెడ్డి వ్యాఖ్యలపై తెలంగాణ బీజేపీ నాయకుల తీవ్ర ఆగ్రహం
- రఫేల్ గురించి మాట్లాడితే పిల్లలు నవ్వుతారని బీజేపీ వ్యాఖ్య
- కేంద్ర మంత్రి, బీజేపీ తెలంగాణ రాష్ట్ర అధ్యక్షుడు కిషన్ రెడ్డి

హైదరాబాద్,మే30 ప్రధానమంత్రి నరేంద్ర మోదీపై తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చేసిన వ్యాఖ్యలు రాజకీయ దుమారం రేపాయి. పాకిస్థాన్‌తో యుద్ధ విరమణ, రఫేల్ యుద్ధ విమానాల అంశాలపై ముఖ్యమంత్రి చేసిన ఆరోపణలను తెలంగాణ బీజేపీ నాయకులు తీవ్రంగా ఖండించారు. కేంద్ర మంత్రి, బీజేపీ తెలంగాణ రాష్ట్ర అధ్యక్షుడు కిషన్ రెడ్డి కాంగ్రెస్ పార్టీ వైఖరిని తప్పుబడుతూ తీవ్రంగా స్పందించారు.



నా జెండా, అజెండా

## బీఆర్ఎస్సే ..

హైదరాబాద్,మే30 తన తండ్రి, పార్టీ అధినేత కేసీఆర్‌కు రాసిన లేఖ బయటకు రావడంపై బీఆర్ఎస్ ఎమ్మెల్సీ కవిత మరోసారి తీవ్రంగా స్పందించారు. ఈరోజు మీడియా ప్రతినిధులతో నిర్వహించిన చిట్‌చాట్‌లో ఆమె పలు కీలక వ్యాఖ్యలు చేశారు. తాను రాసిన లేఖ ఎలా బహిర్గతమైందో, దీని వెనుక ఎవరి ప్రమేయం ఉందో తేల్చాలని ఆమె డిమాండ్ చేశారు లేఖ రాయడానికి ముందే కేసీఆర్‌ను కలిసే అవకాశం వచ్చినా, కొన్ని కారణాల వల్ల కలవలేకపోయానని కవిత తెలిపారు.



# ఉపాధి హామీ ఫథకాన్ని నీరుగారుస్తున్న కేంద్ర ప్రభుత్వం

**హుజూర్ నగర్,ప్రజా ముచ్చట:** మహాత్మ గాంధీ గ్రామీణ ఉపాధి హామీ పథకంను కేంద్ర ప్రభుత్వం నీరుగార్చేందుకు ప్రయత్నం చేస్తుందని దశల వారీగా గ్రామీణ ఉపాధి హామీ పథకంకు నిదుల కోరత సృష్టిస్తుందని ఉపాధి కూలీల ఆకాంక్షలకు అనుగుణంగా కేంద్ర ప్రభుత్వం ఉపాధి అవకాశాలను కల్పించడం లేదనీ బ్లాక్ ఐఎన్టీయుసి అధ్యక్షులు చిట్యాల అమర్నాథ్ రెడ్డి, నియోజకవర్గ అధ్యక్షులు బెల్లంకొండ గురువయ్య ఆరోపించారు.. హుజుర్ నగర్ మండలం గోపాలపురం గ్రామంలో ఉపాధి హామీ కూలీలతో మాట్లాడి వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు.. 100 రోజుల పని కూలీలకు కలిపించడంలో కేంద్ర ప్రభుత్వం విఫలం అవుతుందని అలాగే కూలీలకు వేతనాలు ఆలస్యంగా చెల్లించడం తగదన్నారు.. గ్రామీణ ఉపాధి హామీ కూలీలకు పని చేస్తున్న సమయంలో ప్రమాదవశాత్తు ఏదైనా జరిగితే కేంద్ర ప్రభుత్వ ప్రమాద బీమా వర్తించే విధంగా అధికారులు చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు ఈ కార్యక్రమంలో ఐఎన్టీయుసి మండల అధ్యక్షులు మేళ్ళచెరువు ముక్కంటి.. ఐఎన్టీయుసి నాయకులు మద్దం నాగేందర్ రాయపూడి రామారావు తదితరులు పాల్గొన్నారు



## జిపిఓ పరీక్షలో సత్తా చాటిన అన్నపూర్ణ..




**హుజూర్ నగర్,ప్రజా ముచ్చట:**తెలంగాణ ప్రభుత్వం గ్రామ పరిపాలన అధికారుల నియామకం కోసం నిర్వహించిన పరీక్షలో సూర్యాపేట జిల్లా హుజూర్ నగర్ పట్టణంలోని గోవిందాపురానికి చెందిన బండ్ల అన్నపూర్ణ సత్తా చాటారు.శుక్రవారం వెలువడిన పరీక్ష ఫలితాలలో రాష్ట్ర స్థాయిలో 603 ర్యాంక్,. సూర్యాపేట జిల్లా స్థాయిలో 16 వ ర్యాంక్ సాధించారు.హుజూర్ నగర్ మున్సిపాలిటీలో వార్డు ఆఫీసర గా విధులు నిర్వహిస్తున్న అన్నపూర్ణ మంచి ర్యాంకు సాదించడం పట్ల పట్టణంలో పలువురు,తోటి సిబ్బంది హర్షం వ్యక్తం చేశారు.

# వరకట్నం కేసు నమోదు...

**- భార్యాభర్తలకు కౌన్సిలింగ్ ఇచ్చిన ఎస్సై**
**- పోలీసులు కొట్టారని ఆరోపిస్తున్న భర్త**
**- తన భర్తను పోలీసులు కొట్టలేదని వెల్లడించిన భార్య అనూష**





**పెన్ పహాడ్ / ప్రజా ముచ్చట, మే 30:**తన భర్త తనకు వరకట్నం కింద ఇచ్చిన పొలాన్ని అమ్మి డబ్బులు ఇవ్వాలని వేధింపులకు గురి చేస్తున్నాడని భార్య ఇచ్చిన ఫిర్యాదు మేరకు భర్తపై వరకట్న వేధింపు కింద కేసు నమోదు చేసిన సంఘటన గురువారం చోటుచేసుకుంది. శుక్రవారం ఎస్ఐ కస్తాల గోపికృష్ణ తెలిపిన వివరాల ప్రకారం మండల పరిధిలోని దోసపహాడ్ గ్రామానికి చెందిన దొంగరి అనూష తన భర్త నాగార్జున మా వివాహ సమయంలో నా తల్లిగారు నాకు కట్నం కింద ఇచ్చిన ఎకరం 20 గుంటల వ్యవసాయ భూమిని అమ్మి డబ్బులు తీసుకురావాలని గత కొంత కాలంగా ప్రతిరోజు మద్యం సేవించి మానసికంగా, శారీరకంగా వేధిస్తున్నాడని స్థానిక పోలీస్ స్టేషన్ లో గురువారం ఫిర్యాదు అందించగా విచారణలో భాగంగా భార్యాభర్తలు ఇరువురికి కౌన్సిలింగ్ ఇవ్వడం జరిగిందని అయినప్పటికీ భర్త నాగార్జున ఈ కౌన్సిలింగ్ కు సహకరించకపోగా భూమి అమ్మి డబ్బులు ఇవ్వాలని , తనకు అప్పులు ఉన్నాయని స్టేషన్ లో కూడా భార్యను నిందిస్తుండగా మీరు కోర్టులో తేల్చుకోండని అదే రోజు వరకట్న వేధింపుల క్రింద కేసు నమోదు చేయడం జరిగిందని తెలిపారు. అయితే నాగార్జున ముందస్తుగా పురుగుల మందు డబ్బా తీసుకొచ్చి దాచిపెట్టుకొని స్టేషన్ నుంచి బయటకు వెళ్లిన తర్వాత అట్టి పురుగుల మందు తాగాడని స్థానికంగా చూసిన రాంబాబు గౌడ్ అనే వ్యక్తి తమకు తెలియజేయడంతో అందుబాటులో ఉన్న వాహనం ద్వారా చికిత్స నిమిత్తం సూర్యాపేట లావణ్య ఆసుపత్రికి తరలించడం జరిగిందన్నారు... కానీ నిందితుడు పోలీసులు తనను తన భార్య ముందే కానిస్టేబుల్ మహేష్, ఎస్సై కొట్టారని ప్రసార మాధ్యమాలకు సమాచారమందిచగా ఇది వాస్తవం కాదని నిందుతుని భార్య దొంగరి అనూష సోషల్ మీడియా ద్వారా వీడియో అందించి తన భర్త నాగార్జున ఆరోపణలో వాస్తవం లేదని తెలిపారు. అట్టి వీడియోలో ఆమె మాట్లాడుతూ పోలీసులు తన భర్తను కొట్టలేదని, తమరిరువురికి భార్యాభర్తల బంధం గురించి, కుటుంబ సంబంధాల పై కౌన్సెలింగ్ ఇచ్చారని అవేవీ వినకుండా నాకు డబ్బులు కావాలి పొలం అమ్మి తీసుకురా అంటూ పురుగుల మందు తాగాడని , అతను ఇదివరకు కూడా రెండు మూడు పర్యాయాలు ఇలాగే మందు తాగి వేధింపులకు గురి చేశాడని ఆమె వెల్లడించారు... ఇందులో తానిచ్చిన ఫిర్యాదు మేరకే కేసు నమోదు చేయడం జరిగిందని, ఎస్సై, పోలీసుల ప్రమేయం లేదని తెలిపారు... ఎస్సై కస్తాల గోపికృష్ణను సంప్రదించగా తానుగాని, తన సిబ్బంది కానీ నాగార్జునను కొట్టలేదని తెలిపారు.

# సే సూత్రంతో జరిగిన విధ్వంసం

జీన్ బాప్టిస్ట్ సే అనే ఫ్రెంచి ఆర్థికవేత్త 18వ శతాబ్దానికి చెందినవాడు. అతను ఒక సూత్రాన్ని ప్రతిపాదించాడు. ”సరుకుల సరఫరాయే దానికి సరిపడా డిమాండ్‌ను సృష్టిస్తుంది” అన్నదే ఆ సూత్రం. దాని ప్రకారం ఏ ఆర్థిక వ్యవస్థలోనైనా, మొత్తంగా ఉత్పత్తి అయ్యే సరుకులకు సరిపడా డిమాండ్ ఉండి తీరుతుంది. డిమాండ్ కొరత ఉండే ప్రసక్తే రాదు. ఈ సూత్రాన్ని సమర్థిస్తూ అతడి వాదన ఇలా సాగింది: ఏ సరుకు ఎంత ఉత్పత్తి అవుతుందో దాని విలువకు సమానంగా దాని ఉత్పత్తితో సంబంధం కలిగివున్నవారి ఆదాయాలు కూడా సమకూరుతాయి. ఈ ఆదాయాన్ని వారు ఖర్చు చేయనూవచ్చు లేదా దాచుకోవచ్చు (పొదుపు చేయవచ్చు). ఏ మేరకు ఖర్చు అవుతుందో ఆ మేరకు ఆ సరుకులకు మళ్ళీ డిమాండ్ ఏర్పడుతుంది. ఏ మేరకు దాచుకుంటారో, ఆ మేరకు దాచుకున్న సొమ్ముతో పెట్టుబడికి అవసరమయ్యే సరుకులనైనా కొంటారు లేదా పెట్టుబడి పెట్టేవారికి రుణాల రూపంలోనైనా ఇస్తారు. అంటే ఎంత మొత్తాన్ని దాచుకుంటారో దానికి సరిసమానంగా ధనం పెట్టుబడి రూపంలో మార్కెట్‌లోకి ప్రవేశిస్తుంది. ఆ రుణాల మీద వడ్డీ కూడా మార్కెట్ లోకి ఖర్చు రూపంలోనో, పెట్టుబడి రూపంలోనో తిరిగి ప్రవేశిస్తుంది. అందుచేత పెట్టుబడిదారీ వ్యవస్థలో పూర్తి స్థాయిలో అందరికీ ఉపాధి కల్పించి తీరాల్సిన ఆగత్యం ఏమీ లేదు. ఉత్పత్తి అయిన సరుకుల విలువకు సమానంగా ఆదాయాలు కూడా సమకూరుతాయి కనుక సరుకుల డిమాండ్ అనేది తప్పకుండా ఉంటుంది. కొన్ని సరుకుల విషయంలో సప్లైకి డిమాండ్ సరిపోకపోవచ్చు కాని మొత్తంగా ఆర్థిక వ్యవస్థను చూసినప్పుడు ఆ విధంగా ఉండదు. సప్లై ఎంత ఉంటుందో, డిమాండ్ కూడా అంతే ఉంటుంది.”-ఇదీ సే చేసిన వాదన.సే సూత్రంతో ఒక సమస్య ఉంది. ప్రస్తుత కాలంలో ఎంత ఆదాయం సమకూరిందో ఆ ఆదాయమంతా ప్రస్తుత కాలంలో ఉత్పత్తి అయిన సరుకుల వినిమయం కోసమే ఖర్చు చేయబడుతుందని ఆ సూత్రం భావిస్తుంది. లేదా ఆ ఆదాయంలో కొంత భాగం దాచుకుంటే అలా దాచుకున్న మొత్తం కూడా ప్రస్తుత కాలంలోనే పెట్టుబడిగా తిరిగి మార్కెట్ లోకి వస్తుందని భావిస్తుంది. ఐతే ఆదాయాన్ని పొందినవారు దానిని డబ్బు రూపంలోనే దాచుకున్నప్పుడు ఏం జరుగుతుందన్నది సే సూత్రం వివరించలేదు. అలా కొంత ధనాన్ని దాచుకున్నప్పుడు మార్కెట్‌లోకి ప్రవేశించిన సరుకుల విలువకు సమానంగా డబ్బు మార్కెట్‌లోకి రాదు. అప్పుడు సప్లైకి సరిపడా డిమాండ్ ఉండదు. అటువంటప్పుడు తగ్గిన డిమాండ్‌కు అనుగుణంగా సరుకుల ధరలను గనుక తగ్గిస్తే అప్పుడు డబ్బు విలువ పెరుగుతుంది. దానిని మరింత ఎక్కువగా దాచుకోవాలన్న ట్రెండ్ పెరుగుతుందిపెట్టుబడిదారీ ఆర్థిక సిద్ధాంతాన్ని సమర్థించే ఆర్థికవేత్తలు సే సూత్రాన్ని ఆమోదిస్తారు. దానిని సమర్థిస్తూ వారిలా వాదిస్తారు: పెట్టుబడిదారులు ఎప్పుడూ తమ సంపదను డబ్బు రూపంలో దాచుకోడానికి సిద్ధపడరు. డబ్బును వారు ఒక మారకపు సాధనంగానే పరిగణిస్తారు. అందుచేత సప్లై-డిమాండ్ సమతూకానికి ఎటువంటి ఇబ్బందీ తలెత్తదు”. ఇది పూర్తిగా అర్థం లేని వాదన. అంతే కాకుండా, అనుభవాన్ని చూసినా ఇది చెల్లదు. అసలు సే సూత్రమే పెట్టుబడిదారీ వ్యవస్థకు అతకని సూత్రం. కార్ల్ మార్క్స్ అందుకే సే సూత్రాన్ని తూర్పారబట్టాడు. పెట్టుబడిదారీ సమాజం అధికోత్పత్తి దిశగా సాగుతుందని రుజువు చేశాడు.ఇంతకీ ఎప్పుడో పాత రోజుల్లోనే సే సూత్రం చెల్లుబాటు కాదని తేలిపోయిన తర్వాత ఇప్పుడు ఈ చర్చ దేనికి అన్న ప్రశ్న తలెత్తవచ్చు. సే సూత్రం చెల్లదని చెప్పినది మార్క్స్ ఒక్కడే కాదు. పెట్టుబడిదారీ ఆర్థికవేత్త అయిన కీన్స్ కూడా 1930 దశకంలో తలెత్తిన మహా మాంద్యం సందర్భంగా సే సూత్రం చెల్లదని తేల్చాడు. అప్పటికి పశ్చిమ దేశాలలోని ఆర్థిక వ్యవస్థలలో బోల్షివిక్-తరహా విప్లవాలు తలెత్తే ప్రమాదం ఉందని గ్రహించి, దాని నుండి పెట్టుబడిదారీ వ్యవస్థను కాపాడడానికి పూనుకున్నాడు. ఆ క్రమంలో ముందు పెట్టుబడిదారీ వ్యవస్థలో తలెత్తిన లోపాలను, బలహీనతలను నిజాయితీగా గుర్తించి ఆ తర్వాత ఆ వ్యవస్థను రిపేరు చేయడానికి పూనుకోవాలని భావించాడు. అప్పుడే విప్లవాలు తలెత్తకుండా జాగ్రత్త పడగలుగుతామని అనుకున్నాడు. అందుకే పెట్టుబడిదారీ వ్యవస్థలో సప్లైకి సరిపడా డిమాండ్ ఎప్పుడూ ఉంటుంది అన్న సే సూత్రం బొత్తిగా పనికిమాలినదని ప్రకటించాడు.ఇప్పుడు అదే సే సూత్రం మళ్ళీ ఆర్థిక చర్చల్లో చోటు సంపాదించింది కనుకనే దానిని మనం ఇక్కడ చర్చిస్తున్నాం. నిజానికి నయా ఉదారవాద ఆర్థిక వ్యవస్థను సమర్థించుకోడానికి సే సూత్రమే ప్రాతిపదికగా ఉంది.నెహ్రూ-మహలనోబిస్ వ్యూహంగా ఆర్థికవేత్తలు పిలిచే ప్రభుత్వ నియంత్రణలోని ఆర్థిక వ్యవస్థను తోసిపుచ్చడానికి, దాని స్థానంలో నయా ఉదారవాద విధానాన్ని ప్రవేశపెట్టడానికి కావలసిన మేథోపరమైన ప్రయత్నాలు నిజానికి 1970 దశకం చివర్లోనే మొదలయ్యాయి. నాలుగు దేశాలు %-% దక్షిణ కొరియా, తైవాన్, హాంగ్‌కాంగ్, సింగపూర్-‘ఆసియా పులులు’ గా ఎదిగి భారతదేశం కన్నా చాలా ఎక్కువ వృద్ధిరేటును నమోదు చేయగలిగాయంటే దానికి కారణం ఆ దేశాలలో ప్రభుత్వ నియంత్రణ నుండి ఆర్థిక వ్యవస్థలు బైటపడడమే అని ఆ మేధావులు వాదించారు. అదే మార్గంలో తక్కిన దేశాలు కూడా ప్రభుత్వ నియంత్రణ లేని ఆర్థిక వ్యవస్థలను అనుసరించడం ప్రారంభిస్తే ఆ దేశాలు కూడా అధిక వృద్ధిరేటు సాధించగలుగుతాయని వారు ప్రచారం చేశారు. ”ముడుచుకుపోయే” దృష్టితో ఉండే ‘నెహ్రూ నమూనా’ను విడిచిపెట్టి ఎగుమతుల మార్కెట్‌ను అందుకునే విధంగా వృద్ధి సాధించేందుకు నయా ఉదారవాద విధానాన్ని చేపట్టాలని బోధించడం మొదలుపెట్టారు. అప్పుడే భారతదేశం కూడా ‘ఆసియా పులి’ గా ఎదుగుతుందని వారు చెప్పారు.ఐతే వీళ్ళు ముందుకు తెచ్చిన ఈ వాదన బొత్తిగా పనికిమాలినది. ప్రపంచ మార్కెట్ మొత్తంగా ఒక వేగంతో విస్తరిస్తూ వుంటే, అప్పుడు అన్ని దేశాల మొత్తం ఉత్పత్తిని కలిపి చూసినప్పుడు ఆ ఉత్పత్తి కూడా అదే వేగంతో విస్తరించగలుగుతుంది తప్ప అంతకన్నా ఎక్కువ వేగంతో కాదు (మార్కెట్ విస్తరణ వేగం ఎంత ఉంటే ఉత్పత్తి పెరుగుదల వేగం కూడా అంతే ఉంటుంది). కొన్ని దేశాలు మార్కెట్ విస్తరణ వేగం కన్నా ఎక్కువ వేగంతో తమ ఉత్పత్తిని పెంచుకుని పోగలుగుతున్నాయంటే దానికి కారణం తక్కిన దేశాలు తమ తమ ఉత్పత్తులను మార్కెట్ వేగం కన్నా తక్కువ వేగంతో చేపట్టడమే. ఇప్పటివరకూ ఉత్పత్తి వేగంలో వెనుకబడ్డ దేశాలు గనుక ఇప్పుడు ఉత్పత్తి వేగాన్ని పెంచడం జరిగితే అప్పుడు ఇంతవరకూ వేగంగా పెరుగుతున్న దేశాలు దెబ్బ తింటాయి. అందుచేత అన్ని దేశాలూ తమ తమ ఉత్పత్తులను వేగంగా పెంచుకుని ఆసియా పులుల మాదిరిగా తయారౌదామని, ఎగుమతుల మార్కెట్ లోకి పెద్ద ఎత్తున ప్రవేశిద్దామని అనుకుంటే అది వాస్తవాన్ని విస్మరించడమే ఔతుంది. ప్రపంచం మొత్తం మీద ఉన్న స్థూల డిమాండ్ పరిమితం అన్నదే ఆ వాస్తవం. ఇలా విస్మరించడానికి కారణం నయా ఉదారవాద సమర్థకులు సే సూత్రం చెల్లుబాటు ఔతుందనే పొరపాటు అవగాహనతో ఉండడమే. నెహ్రూ వ్యూహాన్ని వదిలించుకోవాలన్న పిలుపు వెనుక ఉన్నది అర్థరహితమైన సే సూత్రానికి పెద్దపీట వేయడమే.ఐతే సే సూత్రాన్ని యథాతథంగా వారు ముందుకు తేలేదు. చాటుమాటు వ్యూహాన్ని అనుసరించినందువల్లే వారు జయప్రదం కాగలిగారు. ఒక చిన్న దేశాన్ని ఉదాహరణగా చూపించి వారు తమ వ్యూహాన్ని ముందుకు నెట్టారు. ఏదైనా ఒక చిన్న దేశం, అది బాగా చిన్నది అయినందువల్ల, ఎగుమతులను బాగా పెంచుకుని అంతర్జాతీయ మార్కెట్‌లో చొరబడగలుగుతుంది. ఎందుకంటే అంతర్జాతీయ మార్కెట్‌లో ప్రధానంగా డామినేట్ చేసే పెద్ద దేశాలకు ఈ చిన్న దేశపు కొద్దిపాటి ఉత్పత్తులు పెద్ద పోటీగా నిలవలేవు. అందువల్ల ఆ పెద్ద దేశాలు ఈ చిన్న దేశాల పోటీని పట్టించుకోవు. నయా ఉదారవాద సమర్థకులు ప్రతీ దేశాన్నీ తానొక చిన్న దేశంగానే అనుకునేలా ప్రభావితం చేయగలిగారు. అందుచేత ప్రపంచ స్థూల డిమాండ్‌కి ఉన్న పరిమితిని విస్మరించేట్టు చేయగలిగారు. తద్వారా దొడ్డిదారిన సే సూత్రాన్ని ప్రవేశపెట్టగలిగారు.విజయాలు సాధించినది కేవలం ఆ నాలుగు ఆసియా పులులే కాదు. చైనా, ఆగేయ ఆసియా దేశాలు ఆ తర్వాత మరింత పెద్ద విజయాలు సాధించాయి. ఐతే అవేవీ నయా ఉదారవాద విధాన వ్యూహాన్నిగాని, ‘ఎగుమతుల మార్కెట్ కోసం ఆర్థిక వృద్ధి’ వ్యూహాన్నిగాని అనుసరించిన ఉదాహరణలుగా పరిగణించలేము. ఆ దేశాలు ఎగుమతుల్లో కూడా వృద్ధి సాధించాయంటే దానికి కారణం అటు పశ్చిమ సామ్రాజ్యవాద దేశాలు కూడా తమ దేశాలలోని పరిశ్రమలను చౌకగా శ్రమశక్తి అభించే ప్రాంతాలకు తరలించే వ్యూహాన్ని అనుసరించడమే. మరో విధంగా చెప్పాలంటే సంపన్న పెట్టుబడిదారీ దేశాలు తమ దేశాలో ఆర్థిక వృద్ధి వేగాన్ని తగ్గించుకోవడం వల్లనే చైనా తదితర దేశాలకు అవకాశాలు లభించాయి (సంపన్న పెట్టుబడిదారీ దేశాల పెట్టుబడులు మాత్రం ఈ మార్పు వలన వేగంగా పెరిగాయన్నది కూడా గమనించాలి). ఈ క్రమంలో తక్కిన మూడవ ప్రపంచ దేశాలు పోటీలో వెనుకబడిపోయాయి.

## రాజస్థాన్ ‘కోట’లో ఆత్మహత్యలు ఆపలేమా?

రాజస్థాన్ నడిబొడ్డున ఉన్న కోట నగరం దశాబ్దాలుగా లక్షలాది యువత ఆశయాల నిలయంగా మారింది. దేశ ‘కోచింగ్ రాజధాని’గా పేరొందిన ఈ నగరంలో 2023లో 26 మంది విద్యార్థులు ఆత్మహత్యలు చేసుకోగా, ఈ ఏడాది ఇప్పటికే 14 ఆత్మహత్యలు నమోదయ్యాయి. ఇది జాతీయ స్థాయిలో ఆందోళన రేకెత్తించి, సుప్రీంకోర్టు తీవ్ర విమర్శలు చేసే వరకూ వెళ్లింది.భారత సుప్రీంకోర్టు కోటలో విద్యార్థుల ఆత్మహత్యల పట్ల తీవ్ర ఆందోళన వ్యక్తం చేస్తూ మే 23న రాజస్థాన్ ప్రభుత్వాన్ని ప్రశ్నించింది. ”ఈ పిల్లలు ఎందుకు ఆత్మహత్యలకు పాల్పడుతున్నారు? కోటలో మాత్రమే ఎందుకు? రాష్ట్ర ప్రభుత్వంగా మీరేం చేస్తున్నారు?” వంటి పలు ప్రశ్నలను సంధించింది. అనేక చర్యలు ప్రకటించినప్పటికీ, విద్యార్థుల బలవన్మరణాలు నిరంతరంగా చోటు చేసుకోవడం సుప్రీంకోర్టు జోక్యానికి దారితీసింది.ఐఐటి, ఎయిమ్స్ వంటి దేశంలోని అత్యంత ప్రతిష్టాత్మక ప్రవేశ పరీక్షలకు విద్యార్థులను సిద్ధం చేయాలన్న ఆలోచన నుండి ‘కోట’ ఉద్భవించింది. మాజీ ఇంజనీర్ వి.కె. బన్సాల్‌ను కోట కోచింగ్ పరిశ్రమ పితామహుడిగా పరిగణిస్తారు. ఆయన విజయం బన్సాల్ క్లాసెస్ స్థాపనకు దారితీసింది. ఇది ఇతరులకు నమూనాగా మారింది.కోట విద్యార్థులపై తీవ్ర ఒత్తిడి ఉంటుంది. రోజుకు 12-18 గంటల తీవ్రమైన అధ్యయన షెడ్యూళ్లు, వారపు పరీక్షలు, నిరంతర ర్యాంకింగ్, నిరంతర పోటీ, పనితీరు ఆందోళన వాతావరణాన్ని సృష్టిస్తాయి. మధ్యతరగతి కుటుంబాల నుండి వచ్చే విద్యార్థుల తల్లిదండ్రులు కోట కోచింగ్‌లో తమ జీవితకాల పొదుపును పెట్టుబడిగా పెడతారు. తమ పిల్లలు విజయం సాధించాలన్న ఒత్తిడి ఉంటుంది. మొదటిసారి ఇంటికి దూరంగా, కుటుంబం, పరిచయస్తులకు దూరంగా ఉండటం తీవ్రమైన ఒంటరితనం, ఇంటిపై బెంగకు దారితీస్తుంది. కోచింగ్ పరిశ్రమ లాభాల ఆధారిత నమూనా విద్యార్థుల శ్రేయస్సును విస్మరిస్తుంది. ఈ పరీక్షలలో వైఫల్యం జీవితంలో వైఫల్యానికి సమానమనే నమ్మకం నిరాశ నిస్సహాయ భావాలకు దారితీస్తుంది.ఆత్మహత్యల పెరుగుదలకు కారణాలు ఒకదానితో ఒకటి ముడిపడి ఉన్నాయి. నిరంతర మూల్యాంకనాలు, ర్యాంకుల బహిరంగ ప్రదర్శనలు ప్రమాణాలను అందుకోలేకపోతామనే భయాన్ని పెంచుతాయి. కుటుంబ మద్దతు లేకపోవడం, గంటల తరబడి ఒంటరిగా చదువుకోవడం వల్ల ఏకాంతం ఒంటరితనం పెరుగుతాయి. మానసిక ఆరోగ్య సమస్యలకు సహాయం కోరడానికి సామాజిక చిన్నచూపు, తల్లిదండ్రుల అపార్థాల కారణంగా సంకోచం ఉంటుంది. కఠినమైన షెడ్యూళ్ల కారణంగా విశ్రాంతి, వినోదం, భావోద్వేగ ప్రక్రియకు చాలా తక్కువ సమయాన్ని ఇవ్వడంతో అలసట కలుగుతుంది. ఆదేశాలు ఉన్నప్పటికీ, అర్హత కలిగిన కౌన్సిలర్లు, వైద్యుల లభ్యత సరిపోవడం లేదు.విద్యార్థుల ఆత్మహత్యల నేపథ్యంలో రాజస్థాన్ ప్రభుత్వం, కోచింగ్ సంస్థలు వివిధ చర్యలను అమలు చేశాయి. కోచింగ్ కేంద్రాలకు కొత్త మార్గదర్శకాలు జారీ అయ్యాయి. వీటిలో తప్పనిసరి వారపు సెలవులు, పరీక్షల సమయ నియంత్రణ, పనితీరు ఆధారంగా విద్యార్థులను విభజించకపోవడం, తప్పనిసరి కౌన్సిలింగ్ వంటివి ఏర్పాటు చేస్తున్నారు. మానసిక ఆరోగ్య మౌలిక సదుపాయాలను మెరుగుపరచడానికి, కోచింగ్ కేంద్రాలలో వృత్తిపరమైన మానసిక వైద్యులు, కౌన్సిలర్లను తప్పనిసరిగా నియమిస్తున్నారు. ప్రమాదంలో ఉన్న విద్యార్థులను గుర్తించడానికి సిబ్బందికి గేట్ కీపర్ శిక్షణ నిర్వహిస్తున్నారు. హాస్టళ్లకు ”ఆత్మహత్య-నిరోధక” సదుపాయాలు కల్పిస్తున్నారు. ఇందులో సీలింగ్ ఫ్యాన్‌లకు స్ప్రింగ్-లోడెడ్ పరికరాలు, బాల్కనీలలో లాబీలలో ఆత్మహత్య ప్రయత్నాలను భౌతికంగా నిరోధించడానికి వలలను అమర్చడం వంటివి ఉన్నాయి. పర్యవేక్షణలో భాగంగా, హాస్టల్ వార్డెన్ల ద్వారా విద్యార్థులను తనిఖీ చేయడానికి ”దర్వాజే పే దస్తక్” వంటి కార్యక్రమాలు చేపడుతున్నారు. మహిళా విద్యార్థుల భద్రత కోసం పోలీసుల ”కాలికా స్క్వాడ్” కూడా పనిచేస్తుంది. ప్రభుత్వ చట్ట పరంగా, ఈ చర్యలు ప్రశంసనీయమైనప్పటికీ%ఔ%అమలులో తరతమ తేడాల వల్ల%ఔ%తీవ్రమైన పోటీ, అవాస్తవ అంచనాలు, ఒత్తిడిని నడిపించే వాణిజ్యీకరణ వంటి సమస్యలను పరిష్కరించవనే విమర్శ వినిపిస్తోంది.తాజా నివేదికల ప్రకారం, కోటలో 250కి పైగా నమోదిత కోచింగ్ సంస్థలు ఉన్నాయి. నమోదు కాని, చిన్నా చితకా కేంద్రాలకు లెక్కే లేదు. అగ్రశ్రేణి కోచింగ్ కేంద్రాలు

# ఫాసిజంపై సాధించిన విజయం...



మే 9వ తేదీన ప్రపంచ వ్యాప్తంగా ఫాసింజపై సాధించిన విజయం ఎనభయ్యవ వార్షికోత్సవాన్ని జరుపుకోనున్నారు. 1945వ సంవత్సరంలో సరిగ్గా ఇదే రోజున సోషలిస్టు రష్యాకు చెందిన రెడార్మీ హిట్లర్ ఫాసిస్టు మూకలను నిర్ణయాత్మకంగా ఓడించి బెర్లిన్‌లోని రీచ్‌స్టాగ్ (జర్మనీ పార్లమెంట్ భవనం)పై ఎర్రజెండాను ఎగురవేశాయి. జాత్యహంకారంతో యావత్ ప్రపంచాన్ని పాదాక్రాంతం చేసుకోవాలని మొదలుపెట్టిన యుద్ధంలో అనివార్యంగా ఓటమిని చవిచూడనున్నానని ముందుగానే గ్రహించిన నాజీ హిట్లర్ ఏప్రిల్ 30న ఆత్మహత్య చేసుకున్నాడు. ప్రస్తుతం నెలకొన్న అంతర్జాతీయ, జాతీయ పరిస్థితులలో ఫాసిజంపై సాధించిన విజయానికి అత్యంత ప్రాముఖ్యత ఏర్పడింది. 1920వ దశకంలో నెలకొన్న తీవ్ర ప్రపంచ ఆర్థిక మాంద్యాన్ని అధిగమించడానికి, రాజ్యాధికారంపై ఆధిపత్యం నిలబెట్టుకోవడానికి పాలక శక్తులు ఫాసిజాన్ని ఆశ్రయించాయి. ప్రపంచవ్యాపంగా అనేక దేశాలలో కార్మికవర్గ పోరాటాలు వెల్లువెత్తి, కమ్యూనిస్టు ఉద్యమాలు ఉధృతంగా పెరుగుతూ వచ్చిన దశాబ్దాల కాలం అది. రష్యాలో 1917లో మహత్తర అక్టోబర్ సోషలిస్టు విప్లవం విజయవంతం కావడం, సమాజంలో అన్ని రకాల దోపిడీలను నిర్మూలించడంలో గొప్ప ముందంజ వేయడం ప్రపంచవ్యాప్తంగా అనేక దేశాల ప్రజానీకానికి స్ఫూర్తినిచ్చింది. అధికారం కోల్పోయిన పాత పాలక వర్గాలు రెచ్చగొట్టిన అంతర్యుద్ధాన్ని, చుట్టుముట్టిన సామ్రాజవాద శక్తులను నవజాత రష్యన్ సోషలిస్టు సమాజం విజయవంతంగా ఎదుర్కొని అధిగమించిన తీరును ప్రత్యక్షంగా గమనించారు. ఈ పరిణామాలతో స్ఫూర్తి పొందిన జర్మనీ, హంగేరీ దేశాలలోని కార్మికవర్గం ఆయా దేశాల్లోని పాలక వర్గాలను అధికారం నుండి కూలదోయడానికి ప్రయత్నించింది. వివిధ కారణాల రీత్యా ఈ తిరుగుబాట్లు విఫలం అయ్యాయి. కానీ పాలక బూర్జువా వర్గం ఈ పరిణామాలతో అప్రమత్తం అయ్యింది. ఆర్థిక సంక్షోభ కాలంలో కార్మిక వర్గానికి నాయకత్వం వహించిన కమ్యూనిస్టు పార్టీలు అధికారం చేజిక్కించుకోకుండా చూడడానికి పాలక శక్తులు రకరకాల ఫాసిస్టు ఎత్తుగడలను అవలంభించాయి. ఇటలీలో ముస్సోలిని, జర్మనీలో హిట్లర్, జపాన్‌లో హిరోహితోలు ఫాసిస్టు శక్తులకు ప్రాతినిధ్యం వహించారు. ఆయా దేశాల్లో ఫాసిజం తలెత్తడానికి దేశీయ బూర్జువా వర్గంతో పాటు ఇంగ్లాండ్, అమెరికా, ఫ్రాన్స్ వంటి పెట్టుబడిదారీ దేశాల్లోని బూర్జువావర్గం కూడా ఎంతగానో తోడ్పడింది. ఫోర్ట్, రాక్‌ఫెల్లర్, కోకోకోలా వంటి బడా పారిశ్రామిక సంస్థలు ఫాసిజం అభివృద్ధి చెందడానికి బహిరంగంగానే తోడ్పాటునిచ్చాయి. ఈ పరిణామాలను దృష్టిలో ఉంచుకునే ఫాసిజం అంటే 'కార్మికవర్గ విప్లవాలకు బెదిరి ఫైనాన్స్ పెట్టుబడి బాహాటంగా ఉగ్రవాద నియంతృత్వానికి పాల్పడడం' అని కమ్యూనిస్టు ఇంటర్నేషనల్ నాయకుడు, ఫాసిస్టు వ్యతిరేక యోధుడు అయిన జార్జి డెమిట్రోవ్ నిర్వచించాడు. హిట్లర్ జర్మనీని పున: సైనికీకరించడం గురించి మొదట్లో పెట్టుబడిదారీ దేశాల్లోని బూర్జువావర్గం ఆందోళన పడలేదు. ఈ భూమ్మీద నుండి కమ్యూనిజాన్ని తుడిచిపెడతాను అన్న హిట్లర్ లక్ష్య ప్రకటనను విశ్వసించారు. వాళ్ళు కోరుకునేది కూడా అదే. నాడు బ్రిటన్ ప్రధానిగా ఉన్న విన్‌స్టన్ చర్చిల్ కమ్యూనిజం పట్ల తనకు ఉన్న తీవ్ర విద్వేషాన్ని ఎన్నడూ దాచిపెట్టుకోలేదు. కమ్యూనిస్టు రష్యాను హిట్లర్ ఓడించి తీరతాడని ఈ పెట్టుబడిదారీ దేశాలు గట్టిగా నమ్మాయి. ఈ గుడ్డి నమ్మకంతోనే హిట్లర్ యూరప్ దేశాల మీద యుద్ధానికి దిగినప్పుడు అతన్ని నిలవరించడానికి ప్రయత్నించలేదు. హిట్లర్ ఫాసిజాన్ని తిప్పికొట్టడానికి 'ఫ్రంట్' కడదాం రమ్మని స్టాలిన్ ప్రతిపాదించినపుడు బ్రిటన్, అమెరికా, ఫ్రాన్స్ దేశాలు గట్టిగా తిరస్కరించాయి. హిట్లర్ తన సైన్యాన్ని ఫ్రాన్స్ మీదకు నడిపించి ఆ దేశాన్ని ఓడించి, బ్రిటన్‌ను బెదిరించిన తరువాత ఆ దేశాలు కళ్ళు తెరిచాయి, హిట్లర్ ప్రమాదాన్ని గ్రహించాయి. అయినా 'ఫాసిజానికి వ్యతిరేకంగా కలిసి పోరాడుదాం' అని స్టాలిన్ పదేపదే చేసిన ప్రతిపాదనలను నిర్లక్ష్యం చేశాయి. సోషలిస్టు రష్యాను హిట్లర్ ఓడించి తీరతాడన్న ఆశలు పెట్టుకున్నాయి. ఈ ఆశలతోనే ఫాసిజంపై రెండవ దిక్కు నుంచి సాగించాల్సిన యుద్ధాన్ని అమెరికా, ఇంగ్లాండ్, ఫ్రాన్స్ దేశాలు రెండేళ్ళు ఆలస్యంగా మొదలుపెట్టాయి. ఇన్ని ఆటంకాల మధ్యన హిట్లర్ నాజీ సైన్యాన్ని ఎదుర్కొని, ఫాసిజాన్ని మట్టి కరిపించడంలో సోషలిస్టు రష్యా కీలక పాత్ర పోషించింది. ఈ యుద్ధంలో 2 కోట్ల మంది రష్యన్లు అసువులు బాశారు. 30 లక్షల మంది కమ్యూనిస్టు పార్టీ సభ్యులు యుద్ధంలో ప్రాణాలు కోల్పోయారు. దేశీయ పరిశ్రమలు, వ్యవసాయం ఘోరంగా దెబ్బతినిపోయాయి. ఇళ్లు, స్కూళ్లు, ఆసుపత్రులు తదితర మౌలిక వసతులు శిధిలాల గుట్టలుగా మారాయి. స్టాలిన్ గ్రాడ్, లెనిన్ గ్రాడ్, కురుస్క్ ప్రాంతాలలో జర్మన్ ఫాసిస్టు మూకలను ఎదుర్కొని తిప్పికొట్టడంలో అసమాన ధైర్య సాహసాలు ప్రదర్శించారు. మాతృ దేశానికి చెందిన ప్రతి అంగుళం భూభాగాన్ని నిలబెట్టుకోవడానికి సోవియట్ సైన్యాలు భీకర పోరాటం సాగించాయి. రెడార్మీ సాధించిన ఈ విజయాలు చూశాక అమెరికా, బ్రిటన్, ఫ్రాన్స్ దేశాలకు హిట్లర్‌ను ఓడించవచ్చన్న నమ్మకం కలిగింది. హిట్లర్ సైన్యాన్ని సోవియట్ భూభాగం నుంచి నిర్ణయాత్మకంగా, విజయవంతంగా వెనక్కి తిప్పికొట్టడం మొదలవడం చూసి అప్పుడు పై మూడు దేశాలు జర్మనీ మీద రెండవ దిక్కు నుంచి దాడులు మొదలుపెట్టాయి. సోవియట్ రెడార్మీ కేవలం తమ భూభాగం నుంచి నాజీ సైన్యాన్ని తిప్పికొట్టడంతో సరిపెట్టుకోకుండా కమ్యూనిస్టు అంతర్జాతీయ స్ఫూర్తితో జర్మనీ రాజధాని బెర్లిన్ వైపుగా దూసుకుపోతూ అంతకు ముందు హిట్లర్ పాదాక్రాంతం చేసుకున్న యూరప్ దేశాల భూభాగాలను ఒకటొకటిగా విముక్తం చేశాయి. ఈ క్రమంలో ఫాసిస్టు ఆక్రమిత దేశాల్లోని కమ్యూనిస్టు పార్టీలు వీరోచిత పాత్ర పోషించాయి. ఆయా దేశాల్లో ఫాసిస్టు శక్తులకు వ్యతిరేకంగా ప్రతిఘటనా పోరాటాలు పెంపొందించడానికి, గెరిల్లా దాడులు నిర్వహించడానికి కృషి చేశాయి. అత్యంత ధైర్య సాహసాలతో సాగిన ఈ కృషికి విస్తృతమైన మన్నన లభించింది. హిట్లర్ ఓటమి చవిచూశాక నాజీ సైన్యం ఆక్రమించుకున్న అనేక దేశాల్లోని ప్రజానీకం కమ్యూనిస్టు పార్టీని ఏర్పాటు చేసుకొని తమ తమ దేశాలను సోషలిస్టు పంథా వైపు నడిపించే కృషి చేపట్టాయి. ఈ క్రమంలోనే అనేక తూర్పు యూరప్ దేశాలు కమ్యూనిస్టు దేశాలుగా అవతరించాయి. ఫ్రాన్స్, స్పెయిన్ వంటి పశ్చిమ యూరప్ దేశాలలో కమ్యూనిస్టు పార్టీలు గణనీయమైన రాజకీయ శక్తిగా ఎదిగాయి. కమ్యూనిజం ప్రాభవాన్ని, సోషలిజం విస్తరణలను దృష్టిలో ఉంచుకుని బూర్జువావర్గం ఆధిపత్యాన్ని నిలబెట్టుకోవడానికి అమెరికా యూరప్ పున:నిర్మాణానికి ఒక 'మాస్టర్ ప్లాన్' రూపొందించింది. పెట్టుబడిదారీ దేశాలు కూడా ఈ కాలంలోనే అనేక సామాజిక సంక్షేమ పథకాల అమలుకు పూనుకున్నాయి. 'సంక్షేమ రాజ్యా'ల భావన ఉనికిలోకి వచ్చింది. ఫాసిజాన్ని నిర్ణయాత్మకంగా ఓడించడంలో సోవియట్ సోషలిస్టు రష్యా, రెడార్మీ నిర్వహించిన మహత్తర పాత్రను తుడిచిపెట్టేదానికి పెట్టుబడిదారీ వర్గాలు శతథా ప్రయత్నించి విఫలమయ్యాయి. చరిత్రను వక్రీకరించడానికి సాంస్కృతిక రంగాన్ని ఒక సాధనంగా వాడుకున్నాయి. రెండవ ప్రపంచ యుద్ధం మీద హాలీవుడ్ నిర్మించిన సినిమాలు ఇందుకు ఒక ఉదాహరణ. ఈ యుద్ధంలో అమెరికా, బ్రిటన్‌లు పోషించిన పాత్రను ఎక్కువ చేసి చూపిస్తూ, రెడార్మీ నిర్ణయాత్మక పాత్రను కావాలనే తక్కువ చేసి చూపడమో లేదా పూర్తిగా విస్మరించడమో చేశాయి.

## మితిమీరిన వీధి కుక్కల దాడులు



ఇటీవల వెలువడిన ఒక సర్వే ప్రకారం ప్రపంచ వ్యాప్తంగా సంభవించే రేబిస్ మరణాల్లో 36 శాతం మన దేశం నుంచే ఉంటుండటం ఆలోచించాల్సిన విషయం. అంతేకాదు. ప్రపంచ ఆరోగ్య సంస్థ (డబ్ల్యు.హెచ్.ఓ ) ప్రకారం ప్రపంచవ్యాప్తంగా ఈ వీధికుక్కల కాటు వల్ల ఏటా 18 వేల నుంచి 20 వేల మరణాలు సంభవిస్తుండటం, 30 నుంచి 60 శాతం మృతుల్లో అభం శుభం తెలియని చిన్నారులు ఎక్కువగా ఉంటుండటం మానవత్వం వున్న ప్రతి ఒక్కరి హృదయాలను తీవ్రంగా కలిచివేసే విషయం. అదేవిధంగా యానిమల్ బర్త్ కంట్రోల్ రూల్-2001 ప్రకారం ఈ వీధి కుక్కల జనాభాను తగ్గించడానికి వాటికి స్టెరిలైజేషన్ టీకాలు వేయాల్సి ఉంటుంది. అయితే చాలా రాష్ట్రాల్లో నిధుల కొరతతో వీటికి టీకాలు వేయడంలో విఫలం అవుతుండటం ప్రజల పాలిట శాపంగా మారి, ఈ వీధి కుక్కల దాడులు వల్ల ప్రజల అమూల్యమైన ప్రాణాలకు ఏ మాత్రం గ్యారంటీ లేకుండా పోతోంది. ఇప్పటికైనా మించిపోయింది లేదు. ఈ వీధి కుక్కల కాటు నుంచి దేశ ప్రజానీకానికి విముక్తి కలిగించాలంటే తక్షణమే మన కేంద్ర ప్రభుత్వం వారు యుద్ధ ప్రాతిపదికన కదలాలి. సంబంధిత శాఖ వారికి ఈ వీధి కుక్కల దాడులను అరికట్టే చర్యలకు పూనుకునేలా సిఫారసు చేయాలి. లేకపోతే ప్రతి ఏడాది వేలాది మంది విలువైన ప్రాణాలు ఈ వీధికుక్కల కాటు వల్ల అనంత వాయువుల్లో కలిసిపోతాయి. వీధి కుక్కల దాడుల విషయంలో తస్మాత్ జాగ్రత్త!

## మధ్యతరగతి ఎందుకు కొనలేకపోతున్నది?

దేశ ఆర్థిక వ్యవస్థకు వెన్నెముకగా నిలిచిన మధ్యతరగతి నేడు కొనుగోలు తగ్గించుకుంటున్నది. గత అనేక దశాబ్దాలుగా ప్రభుత్వ విధాన నిర్ణయాలను తీవ్రంగా ప్రభావితం చేసిన ఈ వర్గం నేడు ఆ ప్రభుత్వాల విధానాలతో ఉక్కిరిబిక్కిరి అవుతున్నది. పెరుగుతున్న ఖర్చులు-తరుగుతున్న ఆదాయాలతో ఆందోళన చెందుతున్నది. తమ గురించి, తమ పిల్లల భవిష్యత్ గురించి వేదనకు గురౌతున్నది. తమ దగ్గర వున్న కొద్దిపాటి డబ్బును ఖర్చు చేయడానికి భయపడుతున్నది. వీటన్నిటి ప్రభావం రియల్ ఎస్టేట్ వ్యాపారం, సరుకులు, వాహనాల కొనుగోలు రూపాల్లో స్పష్టంగా కనిపిస్తుంది. ఈ తరగతితో శక్తికి మించి అప్పులు చేయించి లాభపడిన వ్యాపార సంస్థలు నేడు వ్యాపార లావాదేవీలు తగ్గిపోయాయని గగ్గోలు పెడుతున్నాయి. ఈ స్థితి నుండి తమను పాలకులు బయట వేస్తారనే విశ్వాసం కోల్పోయి, అతీతశక్తులను ఆరాధించడం పెరిగింది. గత మూడు దశాబ్దాల్లో ప్రపంచీకరణ విధానాలతో వేగంగా విస్తరించిన మధ్యతరగతి నేడు జాతీయ, అంతర్జాతీయ ఆర్థిక, రాజకీయ పరిస్థితుల వల్ల తీవ్ర ఆందోళనకు గురౌతున్నది. ఆక్స్‌ఫర్డ్ ఎకనామిక్స్ అంచనా ప్రకారం, రాబోయే పది సంవత్సరాల్లో మన దేశంలో మధ్యతరగతి కుటుంబాలు రెట్టింపు అవుతాయి. 2024లో 35 కోట్లుగా వున్న ఈ తరగతి 2034 నాటికి 69 కోట్లకు పెరుగుతుందని తెలిపింది. అందుకే దేశాభివృద్ధిలో ఈ తరగతి వినిమయం చాలా కీలకమవుతుంది. కార్పొరేట్ వ్యాపార సంస్థలు వీరిని ఆకర్షించి వ్యాపారాన్ని పెంచుకోవడానికి, ఊహల పల్లకిలో పెట్టి పాలకులు లాభపడడానికి, అసత్యాలు, అర్ధసత్యాలతో సంచలనాత్మక ప్రసారాలతో రేటింగ్ పెంచుకోవడానికి మీడియా నిత్యం అనేక ప్రయత్నాలు చేస్తుంటుంది. తమ అభివృద్ధికి అమెరికా డాలర్లను కొలమానంగా భావించే కొద్దిమంది మధ్యతరగతి వారు తమ పిల్లల భవిష్యత్ గురించి నేడు ట్రంప్ విధానాలతో భయాందోళన చెందుతున్నారు. దేశంలో 11 సంవత్సరాలుగా నరేంద్ర మోడీ ప్రభుత్వం అనుసరిస్తున్న విధానాల వల్ల ఉద్యోగ భద్రత లేకపోవడం, ఉద్యోగాలు భర్తీ చేయకపోవడం, ధరలు పెరగడంతో మధ్యతరగతి ఖర్చు చేయడానికి భయపడుతుంది. తమ ఆదాయంలో ఎక్కువ భాగం అప్పుల వడ్డీలు, ఇఎంఐ లు చెల్లించడానికే సరిపోయే స్థితికి చేరింది. గత 25 సంవత్సరాల్లో వస్తువుల వాడకం, గృహ నిర్మాణం ద్వారా విస్తరించిన వినిమయ మార్కెట్ నేడు మందగించింది. ఫిన్‌టెక్ ప్లాట్‌ఫామ్ నిర్వహించిన సర్వే ప్రకారం దేశంలోని మొత్తం కుటుంబాల్లో 67 శాతం మంది వ్యక్తిగత రుణాలు తీసుకున్నారని, వీరిలో 53 శాతం మంది 30 ఏళ్ళ లోపు వారని తెలిపింది. ఇందులో అత్యధికులు ఐటి ఉద్యోగులు. వీరే నయా మధ్యతరగతివారు. రేపు లేదన్నట్లు ఖర్చు చేయగల ఖరీదైన వినిమయదారులు. రిజర్వుబ్యాంకు రిపోర్టు ప్రకారం 2018లో మధ్యతరగతి వారు తమ ఆదాయంలో 30.4 శాతం అప్పుల చెల్లింపులకు ఖర్చు చేస్తుండగా, నేడు సుమారు 41 శాతం ఖర్చు చేస్తున్నారు. ఇంత పెద్ద ఎత్తున అప్పుల చెల్లింపులు వుండడంతో కొత్త సరుకులను కొనడం పట్ల ఆసక్తి చూపడంలేదు. దీని ప్రభావం దేశ ఆర్థిక వ్యవస్థ మీద తీవ్రంగా ఉంది. తయారీ రంగం విస్తరించకపోవడం, కొత్త ఉపాధి అవకాశాలు తగ్గడం, మధ్యతరహా వ్యాపారాలు, రియల్ ఎస్టేట్ లాంటి రంగాలు కష్టాల్లో కూరుకుపోయాయి. హిందుస్తాన్ యూనిలీవర్, నెస్లే ఇండియా సంస్థలు పట్టణాల్లో కొనుగోలు తమ అంచనాల కంటే ఎక్కువగా తగ్గిందని ప్రకటించాయి.

# విశాఖ భూములు కారుచౌకగా కట్టబెడుతున్నారు




ప్రైవేట్ పెట్టుబడులను ఆకర్షించాలనే పేరుతో విశాఖలో అత్యంత విలువైన భూములను అతి తక్కువ ధరలకే కట్టబెట్టే ప్రయత్నంలో రాష్ట్ర ప్రభుత్వం నిగమ్నమైంది. స్పీడ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్ పేరుతో విశాఖలోని వేల కోట్ల రూపాయల విలువైన ప్రభుత్వ భూములను చడీచప్పుడు కాకుండా కారుచౌకగా కార్పొరేట్లకు ధారాదత్తం చేస్తున్నది. ఇటీవల టాటా కన్సల్టెన్సీ సర్వీస్ లిమిటెడ్ (టిసిఎస్)కి హిల్ నెంబర్ 3లో 21 ఎకరాల భూములను కేటాయించారు. ఉర్సా కంపెనీకి దాని పక్కన, కాపులుప్పాడలోనూ భూమిని కేటాయించారు. టిసిఎస్ రూ.1370 కోట్ల పెట్టుబడులతో 12 వేల మందికి ఉపాధి అవకాశాలు కల్పించడానికి ఒప్పందం కుదుర్చుకున్నారు. టిసిఎస్‌కు ఎకరా 99 పైసలకే కేటాయించినట్లు వార్తలు వచ్చాయి. ప్రతిష్టాత్మక టిసిఎస్ ఇట్లాంటి ఒప్పందానికి ఎలా అంగీకరించింది? ఇది ప్రభుత్వం అత్యుత్సాహమా? వాస్తవం ఏంటనేది ప్రజలకు తెలియజేయాలి. ఆ పక్కనే ఉర్సా కంపెనీకి భూములు కేటాయించడం పట్ల కూడా ప్రజల నుండి తీవ్రమైన వ్యతిరేకత వచ్చింది. దీనికి ప్రధాన కారణం ఈ కంపెనీని 2025 ఫిబ్రవరి 12న ప్రారంభించారు. దీనికి కార్పొరేట్ గుర్తింపు (రిజిస్ట్రేషన్ నెంబర్ 193897) ఇచ్చారు. రూ.10 లక్షల పెట్టుబడితో ఏర్పడిన కంపెనీ ఇది. రెండు తెలుగు రాష్ట్రాల్లోను వేల కోట్ల పెట్టుబడి పెట్టడానికి ఎలా ఒప్పందం కుదుర్చుకున్నారు? ఈ కంపెనీకి ఇద్దరు మాత్రమే డైరెక్టర్లుగా వున్నారు. ఐటి రంగంలో కనీసం గుర్తింపు లేని కంపెనీ. ఇలాంటి కంపెనీకి టిసిఎస్ పక్కనే కేటాయిస్తే అంతర్జాతీయ గుర్తింపు వస్తుందనే కుట్ర దాగి వుందా? లేదా ఏ లాభాపేక్షతో ఉర్సాకు భూములు కేటాయించారు? ప్రభుత్వ పెద్దలే చెప్పాలి. రాష్ట్ర ప్రభుత్వంలో అనుకూలురు వుంటే కోట్లాది విలువ చేసే భూములను పొందవచ్చనేది ఉర్సా ఉదంతం తెలియజేస్తున్నది. ఉర్సా కంపెనీకి కేటాయించిన భూములపై అనేక అనుమానాలను విశాఖ ప్రజలు వ్యక్తం చేస్తున్నారు. నిజానిజాలను రాష్ట్ర ప్రభుత్వమే ప్రజలకు చెప్పాల్సి వుంది. ఉర్సా కంపెనీకి కేటాయించిన భూమి అత్యంత విలువైన భూమి. ఈ కంపెనీలతో జరిగిన ఒప్పందాలు అత్యంత రహస్యంగా వుంచాల్సిన దుస్థితి ఎందుకు దాపురించింది? మొదట ఎకరా 99 పైసలకే కేటాయించారని ప్రసార మాధ్యమాల్లో ప్రచారం జరిగింది. ప్రభుత్వం వెంటనే ఎకరా 99 పైసలకు కాదని బదులిచ్చింది. ఒక కంపెనీతో ఎం.ఒ.యు కుదుర్చుకున్నప్పుడు ఆ కంపెనీ చరిత్ర తెలుసుకోవాలి. చేసుకున్న ఒప్పందాన్ని అమలు చేస్తుందా? లేదా? అనే విశ్వాసనీయమైన అంశాలను పరిగణనలోకి తీసుకోకుండా ఏకపక్షంగా భూములు కేటాయించినట్లు అర్ధమౌతుంది. ఉర్సా క్లస్టర్ అంతర్జాతీయంగా పేరున్న నిపుణులతో ఏర్పాటయిన కంపెనీ అని, ఈ కంపెనీ రూ.5196 కోట్ల పెట్టుబడితో డేటా సెంటర్ ఏర్పాటు చేసి 2500 మందికి ఉపాధి అవకాశాలు కల్పిస్తురదని రాష్ట్ర ప్రభుత్వం ప్రచారం చేస్తున్నది. విశాఖ ఐ.టి పార్కు దగ్గర హిల్ నెంబర్ 3లో 3.50 ఎకరాలు, కాపులుప్పాడలో 56 ఎకరాలు, మొత్తంమీద 60 ఎకరాలు కేటాయించారు. ఈ భూములు వేల కోట్ల రూపాయల ఖరీదైనవి. కాపులుప్పాడలో కేటాయించిన 56 ఎకరాలకు ఎకరా 50 లక్షలకే కేటాయించినట్లు ప్రభుత్వం ప్రకటించింది. అంటే 28 కోట్లకే కేటాయించారు. హిల్ టాప్‌పై ఉన్న 3.50 ఎకరాలను ఎకరా కోటి చొప్పున 3.50 కోట్లకే భూములు కేటాయించారు. ఇంత కారుచౌకగా ఊరు, పేరు లేని కంపెనీకి కేటాయించడం వెనుక ఆంతర్యం ఏమిటో ప్రభుత్వమే చెప్పాలి. ఇంత అడ్డగోలుగా భూములు కేటాయించి దానిని సమర్ధించుకొనే ప్రయత్నం చేయడం దుర్మార్గమైనది. విశాఖ ఆర్థిక రాజధాని. ఈ ప్రాంత అభివృద్ధికి కీలకమైన భూములు, కొండలను పరిరక్షించాల్సిన బాధ్యత రాష్ట్ర ప్రభుత్వానిదే. ప్రభుత్వ స్థలాలకు రాష్ట్ర ప్రభుత్వం ట్రస్టీగా వుండి పరిరక్షించాల్సింది పోయి పెట్టుబడిదారులకు లీజుల పేరుతో కారుచౌకగా భూములు కట్టబెడుతున్నారు. భూ దోపిడీకి పాల్పడుతున్నారు. ఈ ప్రభుత్వం వచ్చిన తరువాత విశాఖ ఆర్కే బీచ్‌లో ఉన్న 13.43 ఎకరాల భూమిని లూలు కంపెనీకి కట్టబెట్టారు. అదాని డేటా సెంటర్‌కు 190 ఎకరాల భూమిని హిల్‌టాప్‌లో కేటాయించారు. గూగుల్ డేటా సెంటర్‌కు తర్లువాడ దగ్గర 250 ఎకరాలు కేటాయిస్తున్నట్లు వార్తలు వస్తున్నాయి. గతంలో కూడా నగరం నడిబొడ్డున విప్రో, సత్యం కంప్యూటర్స్‌కు ఇదే తరహాలో జరిగింది. తరువాత అది టెక్ మహేంద్ర కంపెనీగా మార్పు చెందింది. ఐటి సెజ్ హిల్ టాప్‌లో ఇప్పటికే ఐటి కంపెనీలు ఏర్పడ్డాయి. ప్రభుత్వం కేటాయించిన భూముల్లో ఏర్పడిన కంపెనీల్లో ఎంత మందికి ఉపాధి కల్పిస్తామన్నారు? ఎంత మందికి కల్పిస్తున్నారు? వంటి వివరాలను బహిర్గతం చేయాలి. ఇలావుండగా, ఇటీవల కాలంలో అక్కడే ఉన్న ఐటి కంపెనీలో పని చేస్తున్న ఉద్యోగులకు సరిగ్గా జీతాల చెల్లింపులు జరగడంలేదని ఆందోళనలకు దిగారు. విశాఖ ఆర్థిక రాజధాని. ఈ ప్రాంత అభివృద్ధికి కీలకమైన భూములు, కొండలను పరిరక్షించాల్సిన బాధ్యత రాష్ట్ర ప్రభుత్వానిదే. ప్రభుత్వ స్థలాలకు రాష్ట్ర ప్రభుత్వం ట్రస్టీగా వుండి పరిరక్షించాల్సింది పోయి పెట్టుబడిదారులకు లీజుల పేరుతో కారుచౌకగా భూములు కట్టబెడుతున్నారు. భూ దోపిడీకి పాల్పడుతున్నారు. ఈ ప్రభుత్వం వచ్చిన తరువాత విశాఖ ఆర్కే బీచ్‌లో ఉన్న 13.43 ఎకరాల భూమిని లూలు కంపెనీకి కట్టబెట్టారు. అదాని డేటా సెంటర్‌కు 190 ఎకరాల భూమిని హిల్‌టాప్‌లో కేటాయించారు. గూగుల్ డేటా సెంటర్‌కు తర్లువాడ దగ్గర 250 ఎకరాలు కేటాయిస్తున్నట్లు వార్తలు వస్తున్నాయి. గతంలో కూడా నగరం నడిబొడ్డున విప్రో, సత్యం కంప్యూటర్స్‌కు ఇదే తరహాలో జరిగింది. తరువాత అది టెక్ మహేంద్ర కంపెనీగా మార్పు చెందింది. ఐటి సెజ్ హిల్ టాప్‌లో ఇప్పటికే ఐటి కంపెనీలు ఏర్పడ్డాయి. ప్రభుత్వం కేటాయించిన భూముల్లో ఏర్పడిన కంపెనీల్లో ఎంత మందికి ఉపాధి కల్పిస్తామన్నారు? ఎంత మందికి కల్పిస్తున్నారు? వంటి వివరాలను బహిర్గతం చేయాలి. ఇలావుండగా, ఇటీవల కాలంలో అక్కడే ఉన్న ఐటి కంపెనీలో పని చేస్తున్న ఉద్యోగులకు సరిగ్గా జీతాల చెల్లింపులు జరగడంలేదని ఆందోళనలకు దిగారు. ఎ.పి పారిశ్రామికంగా పురోభివృద్ధి చెందాలంటే, ఉపాధి అవకాశాలు రావాలంటే రాష్ట్రానికి ప్రత్యేక హోదా సాధించడమే కీలకమైనది. నేడున్న కేంద్ర ప్రభుత్వానికి మన రాష్ట్ర కూటమి ప్రభుత్వం మద్దతు చాలా కీలకమైనది. కూటమి ప్రభుత్వం ఒత్తిడి తీసుకొస్తే ప్రత్యేక హోదా సాధించవచ్చు. ఫలితంగా అనేక కంపెనీలు రాష్ట్రానికి వచ్చే అవకాశాలున్నాయి. తద్వారా రాష్ట్రాన్ని అభివృద్ధి చేయడానికి పూనుకోవచ్చు. కేంద్ర ప్రభుత్వంపై ఒత్తిడి చేయకుండా కూటమి నాయకులు ప్రభు భక్తి చాటుకుంటున్నారు. ఆంధ్రుల ఆత్మగౌరవాన్ని తాకట్టుపెట్టే విధంగా వ్యవహరిస్తున్నారు. ఇప్పటికైనా కూటమి ప్రభుత్వం ప్రత్యేక హోదా కోసం అన్ని పక్షాలను కలుపుకొని కేంద్రంపై ఒత్తిడి తీసుకురావాలి. విశాఖలో ఉర్సా కంపెనీకి కేటాయించిన భూములు అత్యంత విలువైనవి. ఈ ప్రాంతం పచ్చని కొండలతో నిండి వుంటుంది. ఇప్పుడు వాటిని ధ్వంసం చేస్తున్నారు. విశాఖ ప్రజల అవసరాలను దృష్టిలో పెట్టుకొని పర్యావరణాన్ని, ప్రకృతిని కాపాడాలి. వికసిత ఆంధ్రప్రదేశ్‌లో పర్యావరణం చాలా కీలకమైనది విజన్ 2047లో రాష్ట్ర ప్రభుత్వం ప్రటించింది. ఈ దృష్ట్యా ఉర్సాకు కేటాయించిన భూములను వెనక్కి తీసుకోవాలి. లేదంటే ప్రజాగ్రహానికి గురికావల్సి వస్తోంది.